

పురస్కారాలను అందుకుంటున్న నారాయణ, జస్టిస్ నారాయణ, అరుణాచలం,సిపాయి సుబ్రమణ్యం,రాచపాళెం చంద్రశేఖరరెడ్డి,భానుప్రకాష్ రెడ్డి,ఎస్.లక్ష్మి

# వనరుల సద్వినియోగంతోనే అభివృద్ధి

## జిల్లా అవతరణ దినోత్సవ సభలో సీపీఐ నేత నారాయణ

సహజ వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటేనే జిల్లా సత్వర అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అభిప్రాయపడ్డారు. భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ (అగ్రశ్రీ)ఆధ్వర్యంలో 106వ జిల్లా అవతరణ దినోత్సవ ఉపన్యాసం, అవార్డుల ప్రదానోత్సవ వేడుకలు శుక్రవారం తిరుపతిలో జరిగాయి. ఈసందర్భంగా అవార్డు అందుకున్న నారాయణ 'చిత్తూరు జిల్లాలో సంతులిత అభివృద్ధి- భవిష్యత్ ప్రణాళికలు' అన్న అంశంపై కీలకోపన్యాసం చేశారు.రాయలకాలంలో మన జిల్లాలో చిన్న, పెద్ద చెరువులు 8,250 వరకు వుండేవన్నారు. రాయలసీమలో ఎక్కడాలేని విధంగా ఈచెరువులు గొలుసు కట్టులాగా ఒక చెరువు నిండితే కింద చెరువుకు నీరుచేరేలా వ్యవస్థ వుండేదన్నారు. ఆధునిక కాలంలో పాలకులు అనుసరించిన అస్తవ్యస్థ విధానాల వల్ల ఎంతో ప్రయోజనకరంగా వుండిన చెరువుల వ్యవస్థ నాశనమైందని, అనేక చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని ఆవేదన చెందారు. మరికొన్ని చెరువులు పూడిపోవడం వంటి విపత్కర పరిస్థితుల వలన సగటు మానవుడి ఆహార భద్రతకు పెనుసవాళ్లు ఎదురవుతాయని వివరించారు.మన పాలకులు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని హంద్రీ-నీవా, గాలేరు-నగరి. ఎస్ఎస్ కెనాల్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చెరువుల వ్యవస్థను పునరుద్దరించాలన్నారు. అనంతరం అవార్డుల ప్రదానోత్సవంలో ముందుగా విశిష్టరత్న పురస్కారాన్ని నారాయణకు ముఖ్యఅతిథి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య ఎల్.వేణుగోపాలరెడ్డి బహూకరించారు. న్యాయశిరోమణి పురస్కారాన్ని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నారాయణకు అందజేశారు. ఇంకా... ద్రావిడ వర్శిటీ విశ్రాంత ఉపకులపతి అరుణాచలానికి విద్యా శిరోమణి, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యానికి వైద్య శిరోమణి, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి సాహిత్య శిరోమణి , బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డికి యువ శిరోమణి, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.లక్ష్మికి మహిళా శిరోమణి, జ్యూరీ ప్రత్యేక పురస్కారాన్ని బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌కు అందజేశారు. ఈసందర్భంగా అగ్రశ్రీ వెలువరించిన విశేష సంచిక, బ్రోచర్‌లను రాజ్యసభ మాజీ సభ్యురాలు దుర్గ ఆవిష్కరించారు. జిల్లా అభివృద్ధికి భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలను గురించి పురస్కార గ్రహీతలు తమతమ మనోగతాలను తెలియజేశారు. అగ్రశ్రీ వ్యవస్థాపక సంచాలకుడు డాక్టర్ డి.సుందరరామ్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ డాక్టర్ అగరాల ఈశ్వరరెడ్డి, భారతి, సుధాకర్ మోహన్, డి.సుచరిత తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్